ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబర్ 2023

బతుకుదెరువు కోసం వెళ్లి...

గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి భార్య బోయలక్ష్మిలు గతేడాది గ్రామం వదిలి బెంగుళూరుకు వలసెళ్లారు. వంకసంద్రలో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడ జీవనం సాగించేవారు. వెంకటాద్రి పెయింటర్ పనికి వెళ్తుండగా, భార్య లక్ష్మి గార్మెంట్ పరిశ్రమలో పనికి వెళ్లేది. దసరా పండుగ సందర్భంగా వీరు సొంతూరుకు వచ్చారు. పండుగను ముగించుకుని బెంగుళూరుకు వెళ్తుండగా ప్రమాదంలో ఇద్దరూ మరణించారు. గ్రామంలో గత ఐదు సంవత్సరాల నుంచి వ్యవసాయ, ఉపాధి పనులు సరిగా లేని కారణంగా బతుకుదెరువు కోసం కుమారుడు కోడలు బెంగుళూరుకు వెళ్లారని, ఇక్కడే పని ఉంటే వారు చనిపోయి ఉండేవారు కారంటూ వెంకటాద్రి తండ్రి తండ్రి నాగప్ప కన్నీటి పర్యవంతం అయ్యారు.

మృత్యువులోనూ వీడని మూడుముళ్ల బంధం

ఓడీసీ మండలం నవాబుకోట గ్రామానికి చెందిన వెంకటనారాయణ, ఆయన భార్య వెంకటసుబ్బమ్మలు పొట్టకూటికోసం బెంగళూరుకు వలస వెళ్లారు. వీరి కుమారుడు గోరంట్లలోని చౌడేశ్వరి కాలనీలో చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. దసరా పండగ కావడంతో కుమారుని ఇంటికి వెంకటనారాయణ, వెంకటసుబ్బమ్మలు వచ్చారు. పండుగలో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. పండుగ ముగించుకుని గురువారం ఉదయం టాటా సుమోలో బెంగళూరుకు వెళ్తున్న వీరు ప్రమాదానికి గురై మరణించారు.

మృత్యుఒడికి తల్లీకుమారుడు

పెనుకొండ: మండల పరిధిలోని గోనిపెంటకు చెందిన తల్లీకుమారుడు శాంతమ్మ, కుమారుడు రాజవర్ధన్‌లు సొంతూరులో పనులు లేక ఐదు సంవత్సరాల క్రితం బెంగుళూరుకు వలసెళ్లారు. హొంగసంద్రం వద్ద శాంతమ్మ, భర్త శంకరప్ప, కుమారులు శ్రీనివాసులు, రాజవర్ధన్‌లు కూలి పనులకు వెళ్లేవారు. దసరా పండుగ కావడంతో సొంతూరు గోనిపెంటకు వచ్చారు. పండగను ముగించుకుని శాంతమ్మ అతని కుమారుడు రాజవర్ధన్‌తో కలిసి బుధవారం గోరంట్ల మండలం కాటేపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. శంకరప్ప కుమారుడు శ్రీనివాసులు వారి స్వగ్రామంలో సొంతపని నిమిత్తం నిలిచిపోయారు. గురువారం ఉదయం శాంతమ్మ కుమారుడు రాజవర్ధన్‌తో బెంగుళూరుకు సుమోలో బయల్దేరారు. మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరిద్దరూ మరణించారు.

డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తూ...

గోరంట్ల మండలం కలగేరి గ్రామానికి చెందిన హరిజన నరసింహులు డ్రైవర్ వృత్తిని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ ప్రయాణికుల రద్దీని బట్టి ఒకటి రెండుసార్లు గోరంట్ల నుంచి బెంగళూరులోని వంగసంద్రకు సుమోను తీసుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గోరంట్ల బస్టాండ్ ఆవరణంలో 13 మందిని ఎక్కించుకుని వెళ్తున్న క్రమంలో ప్రమాదంలో ఈయన మరణించాడు. పెద్ద దిక్కును కోల్పోవడంతో ఈయన కుటుంబం దిక్కులేని వారయ్యారు.

రెక్కాడితే గానీ డొక్కాడని జీవితం వారిది. మండేకడుపు నింపుకోవాలంటే కూలి పనులకు వెళ్లాల్సిందే. సొంతూరులో పనులు లేక పక్క రాష్ట్రానికి వలసెళ్తుంటారు. ఇంటి పెద్దకు తోడుగా పనికెళ్తే నాలుగు రూకలొస్తాయని భర్తతో పాటు భార్య, నాన్నతో పాటు కుమారుడు ఇలా అందరూ పనుల కోసం పొట్టచేతబట్టుకుని వెళ్తుంటారు. కుటుంబ పోషణ, పిల్లలను ప్రయోజకులను చేయాలన్న తాపత్రయంతో ఉన్న ఊరిని వదిలి పరాయి ప్రాంతానికి వెళ్లే జీవనం వారిది. శ్రమను నమ్ముకుని జీవన పోరాటం సాగిస్తున్న వారి కుటుంబాల్లో పెనుప్రమాదం చీకట్లను నింపింది. ఊహించని పరిణామం శ్రమజీవుల ఇంట మృత్యుఘోషను మోగించింది. దసరా పండుగకు సొంతూరికి వచ్చి, తిరిగి వలస బాటపట్టిన వారికి అదే చివరి రోజు అయ్యింది. పొద్దు పొడవకముందే బంధువులకు వెళ్లొస్తామని మోములో చిరునవ్వుతో వెళ్లిన శ్రమజీవుల బతుకు విధి విసిరిన మృత్యుపాశానికి బలైంది. కర్నాటక రాష్ట్రం చిక్కబళ్లాపూర్ వద్ద గురువారం వేకువజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది మరణించారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వారు 10 మంది ఉండగా, కర్నాటక ప్రాంతానికి చెందిన వారు ముగ్గురు ఉన్నారు. మృతి చెందిన వారంతా కూలీలే కావడం బాధాకరం. వీరిలో భార్యాభర్త, తల్లీకుమారులు ఉన్నారు. పేద కూలీల ఇంట ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

చిక్కబళ్లాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ కిందకు దూరిపోయిన సుమో

- కూలీలను కమ్మేసిన మృత్యువు
- చిక్కబళ్లాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగివున్న లారీని ఢీ కొన్న సుమో
- 13 మంది మృతి
- మృతులంతా వలసకూలీలే
- 10 మంది సత్యసాయి జిల్లా వాసులు, ముగ్గురు కర్నాటక వాసులు
- కూలీల ఇంట పెను విషాదం
- చీకట్లు నింపిన దసరా పండుగ
- దట్టమైన పోగమంచే ప్రమాదానికి కారణం

వలసెళ్లిన ప్రాణం..!

ప్రజాశక్తి- గోరంట్ల రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కలిగిరి గ్రామానికి చెందిన హరిజన నరసింహులు(45) సుమో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈయన గురువారం వేకువజామున 4గంటల సమయంలో వలస కూలీలను తన సుమోలో బెంగుళూరుకు తీసుకెళ్లేందుకు గోరంట్ల నుంచి బయల్దేరాడు. గోరంట్ల నుంచి 11 మందితో వెళ్లగా మార్గమధ్యంలో మరో నలుగురిని ఎక్కించుకున్నాడు. సుమో చిక్‌బళాపూర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా దట్టంగా ఉన్న పొగమంచులో ముందు నిలిపిన ఆయిల్ ట్యాంకర్ లారీని గుర్తించకుండా ఢీకొన్నాడు. వేగంగా వెళ్లి లారీని ఢీకొనడంతో సుమో దాని కిందకు దూరిపోయింది. అందులో ఉన్న వారు ఒక్కసారిగా లారీ, సుమో సీట్ల కింద ఇరుక్కుపోయారు. ఈ ప్రమాదంలో సుమోలో ఉన్న గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి(27), ఆయన భార్య బోయ లక్ష్మి(23), కొత్తచెరువు మండలం గోరంట్లపల్లి గ్రామానికి చెందిన పవన్(32), గోరంట్ల మండలం కలిగిర గ్రామానికి చెందిన డ్రైవర్ హరిజన నరసింహులు(45), ఓబులదేవర చెరువు మండలం నవాబుకోట గ్రామానికి చెందిన ఎ.వెంకట నారాయణ(51), ఈయన భార్య వెంకట సుబ్బమ్మ(48), చిలమత్తూరు మండలం మొరంపల్లి గ్రామానికి చెందిన గొల్ల గణేష్(17), ఓబుళదేవరచెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప(50), పెనుకొండ మండలం గోనిపెంట గ్రామానికి చెందిన గొల్ల శాంతమ్మ (37), ఆమె కుమారుడు గొల్ల రాజవర్ధన్(15), కర్నాటక రాష్ట్రం మరగనిగుంట్ల గ్రామానికి చెందిన మంగళ మూర్తి(42), కర్నాటక రాష్ట్రం దొడగట్టకు చెందిన నేసే అరుణ(38), ఈమె కుమారుడు నేసే రుత్విక్ సాయి(7)లు మరణించారు. మృతుల్లో గోరంట్ల మండలానికి సంబంధించి ముగ్గురు, ఓబుళదేవచెరువు మండలంలో ముగ్గురు, పెనుకొండ మండలంలో ఇద్దరు, చిలమత్తూరు మండలంలో ఒకరు, కొత్తచెరువులో ఒకరు, కర్నాటక రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఉన్నారు. ప్రమాద విషయం తెలియగానే కర్నాటక పోలీసులు, సహాయక సిబ్బంది వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వద్ద ఉన్న గుర్తింపు కార్డులను బట్టి సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులు, సత్యసాయి జిల్లా పోలీసులకు తెలియజేశారు. దట్టమైన పొగ మంచు ఉండడం వల్ల ముందు ఉన్న లారీని గుర్తించలేకనే ఈ ప్రమాదం జరిగినట్లు చిక్‌బళాపూర్ ఎస్పీ డిఎల్.నగేష్ మీడియాకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం వారి స్వగ్రామాలకు తరలించారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

చిక్‌బళాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది మరణించడం అత్యంత బాధాకరం. మృతుల్లో ఎక్కువ మంది వలస కూలీలే ఉన్నారు. స్థానికంగా వారి గ్రామాల్లో ఉపాధి లేక వీరు బెంగుళూరుకు వలస వెళ్లారు. వారి గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పించి ఉంటే ఇంత మంది కూలీలు మరణించి ఉండేవారు. ఇది ముమ్మాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే జరిగింది. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల ప్రకారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేయాలి. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. అలాగే ప్రతి గ్రామంలోనూ విరివిగి ఉపాధి పనులను కల్పించి వలసలను నివారించాలి.

ఎం.ఇంతియాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

సీమంతానికి వచ్చి...

గోరంట్ల మండలం చుండూరువాండ్లపల్లి గ్రామానికి చెందిన నేసే మల్లికార్జున కుమార్తె అరుణ ఆమె ఏడేళ్ల కుమారుడు రిత్విక్ సాయితో కలిసి బుధవారం నాడు బెంగళూరు నుంచి చెల్లెలు సీమంతం కోసం వచ్చారు. సీమంతం అయిన అనంతరం గురువారం తెల్లవారుజామున కుమారుడితో కలిసి బెంగుళూరు వెళ్లేందుకు గోరంట్ల బస్టాండ్ ఆవరణలో ఉన్న సుమోలో ఎక్కారు. ప్రమాదంలో తల్లీ కుమారుడు ఇద్దరూ మరణించారు.

పెదనాన్నను చూసేందుకు వెళ్తూ..

చిలమత్తూరు : మండల పరిధిలోని మొరంపల్లి గ్రామానికి చెందిన గొల్ల గణేష్ చాల సంవత్సరాల క్రితం గోరంట్ల మండల కేంద్రంకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఇంటర్ విద్యను కూడా గణేష్ గోరంట్లనే పూర్తి చేశాడు. దసరా సందర్భంగా గోరంట్లకు వచ్చిన తన సమీప బంధువులతో కలిసి పెద్దనాన్నను చూసేందుకు సుమోలో బెంగుళూరుకు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందాడు.

భార్యను పుట్టింట్లో వదిలి వెళ్లి..

బాగేపల్లి తాలూకా మార్గానుగుంట్ల గ్రామానికి చెందిన మంగళ నరసింహమూర్తి వత్తి రీత్యా బెంగళూరులో నివాసం ఉంటున్నారు. ఈయన గోరంట్లలో పెళ్లి చేసుకున్నాడు. దసరా పండగ సందర్భంగా భార్యా పిల్లల్ని గోరంట్ల మండలం మల్లాపల్లి గ్రామంలోని భార్య పుట్టింట్లో వదిలేందుకు వచ్చాడు. గురువారం ఉదయం బెంగళూరుకు టాటా సుమోలో వెళ్తుండగా ఈయన మరణించాడు.

ఉద్యోగానికి వెళ్తూ..

కొత్తచెరువు : మండల పరిధిలోని గోరంట్లపల్లి గ్రామానికి చెందిన నాగభూషణ కుమారుడు పవన్ బెంగుళూరులోని అపెక్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. బెంగుళూరులో ఉంటూ ఈయన విధులు నిర్వహించేవాడు. దసరా పండుగ అనంతరం గోరంట్లలో తన భార్యను పుట్టినింటిలో వదిలాడు. గురువారం ఉదయం విధులకు బెంగుళూరుకు వెళ్తుండగా ప్రమాదంలో ఈయన మరణించాడు.

కుటుంబాన్ని వదిలి కూలి పనులకు..

ఓబుళదేవరచెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప కూలి పనుల నిమిత్తం బెంగుళూరుకు వెళ్తుంటాడు. కుటుంబ సభ్యులు స్వగ్రామంలోనే ఉంటారు. దసరా పండుగ సందర్భంగా సొంత గ్రామానికి వచ్చాడు. పండుగ అనంతరం బెంగుళూరుకు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి బస్సులో గోరంట్లకు వచ్చి అక్కడ బెంగుళూరుకు వెళ్లే సుమోలో ఎక్కాడు. ప్రమాదం చోటు చేసుకోవడంతో ఈయన మరణించాడు.

సామాజిక సాధికార బహిరంగ సభలో అభివాదం చేస్తున్న వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు

జగన్‌తోనే 'సామాజిక సాధికారత'

- వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటాం
- 'అనంత' సామాజిక సాధికార బస్సు యాత్రలో వైసిపి నేతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సామాజిక సాధికారత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైసిపి నేతలు పేర్కొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన రాయలసీమ ప్రాంత 'సామాజిక సాధికార బస్సుయాత్ర' అనంతపురం జిల్లాలో ప్రారంభమైంది. గురువారం ఉదయం శింగనమల మండల కేంద్రంలో ప్రారంభమైన యాత్ర కొర్రపాడు, రోటరీపురం మీదుగా బుక్కరాయసముద్రం వరకు కొనసాగింది. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్, అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బీసీ,ఎస్సీ,ఎస్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసారని విమర్శించారు. సామాజిక సాధికారత వారి హయాంలో నిర్లక్ష్యానికి గురైందన్నారు.

బహిరంగ సభకు హాజరైన వైసిపి కార్యకర్తలు

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ,ఎస్టీ,బిసీ, మైనార్టీలను మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీగా చేశారన్నారు. ఎపిలో ముస్లిం మైనార్టీలను ఉపముఖ్యమంత్రిని చేయడం ఒక చరిత్ర అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలతోనే తమ పొత్తు అని చెప్పారు. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ అబద్ధపు మాటలతో మరోమారు ప్రజలను మోసం చేయాడానికి టిడిపి, జనసేనలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జైలుకెళ్లిన తరువాత చంద్రబాబునాయుడుకి ప్రజలు గుర్తుకొస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ హయాంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వారి కోసం రెండు లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేశామని వివరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. పేదల సంక్షేమానికి ఆయన కట్టుబడి పనిచేసే వ్యక్తి అని పేర్కొన్నారు. టిడిపి ఇస్తున్న హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్ మాట్లాడుతూ పేదల వైపు నిలబడే మనిషి జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. పేదలకు మంచి చేయడానికెళ్తే కోర్టుల ద్వారా వాటిని అడ్డుకునే ప్రయత్నాలను టిడిపి చేసిందని విమర్శించారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కొవడం లోకేశ్‌కు చేతకాదని ఎద్దేవా చేశారు. న్యాయాన్ని గెలిపించాలని భువనేశ్వరీ అడగాల్సిన అవసరం లేదని... చంద్రబాబు విషయంలో న్యాయమే గెలుస్తుందని చెప్పారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెబుతున్న మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరి యాత్రను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. ప్రజా రక్షణ భేరికి సంబందించిన పోస్టర్లను స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించవలసిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కు, రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారు కావడం బాధాకరమన్నారు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. ప్రశ్నించిన వారిమీద అర్బన్ నక్సల్ పేరుతో దేశద్రోహ నేరం కింద కేసులు బనాయించి విచారణే లేకుండా ఏళ్ళతరబడి నిర్బంధిస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని తెగనమ్ముతూ, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదానీలకు తేరగా దోచిపెడుతోందని విమర్శించారు. అర్ధాకలితో బతుకుతున్నవారు ప్రపంచంలోకెల్లా అతి ఎక్కువమంది మన దేశంలోనే ఉన్నారంటే అది మోడీ పాలన పుణ్యమే అని అన్నారు. దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిపోయిందన్నారు. గతంలో ఎన్టీయార్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేసినప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం, చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు బషీర్‌బాగ్ పోరాటంలో తెలుగువాడి సత్తా ఏమిటో చూపించామన్నారు. తిరిగి ఇప్పుడు మళ్ళీ అటువంటి మరొక మహోద్యమం కోసమే సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజారక్షణ భేరి యాత్ర చేపట్టిందన్నారు. ఈ యాత్రభాగంగా జిల్లాలోని పెనుగొండ, హిందూపురం, పుట్టపర్తి, నల్లమాడ, కదిరి ప్రాంతాలలో జరిగే బహిరంగ సభలలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, ఇఎస్ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, జడ్పీ శ్రీనివాసులు, జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ నాయకులు గంగాధర్, పెడవల్లి బాబా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

చంద్రబాబు అరెస్టు అక్రమం : టిడిపి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి స్థానిక నాయకులు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. గురువారం పట్టణంలోని హనుమాన్ కూడలిలో టిడిపి నాయకులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేసి 43 రోజులు అవుతున్న ఆయనపై బనాయించిన కేసులను ఇంతవరకు పోలీసులు తగిన సాక్షాలను కోర్టుకు నివేదించలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు జయప్రకాష్, మైనార్టీ నాయకుడు సయ్యద్‌బాషా, నాయకులు హరినాథ్ చౌదరి, మల్లికార్జున, భీమనేని కృష్ణప్ప పాల్గొన్నారు.

సబ్ జూనియర్ ఉమెన్ హాకీలో సోమందేపల్లి విద్యార్థిని ప్రతిభ

సోమందేపల్లి : ఈనెల 24వ తేదీన చెన్నైలోని రాధాకృష్ణ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్సెస్ తమిళనాడు చివరి మ్యాచ్ లో ఏపీ జట్టు తరపున ఆడిన సోమందేపల్లి మండలానికి చెందిన విద్యార్థిని ప్రతిభ కనపర్చింది. మండల కేంద్రంలోని వినాయక్ నగర్ లో నివాసం ఉంటున్న మటన్ సెంటర్ నిర్వాహకుడు రవి నాయక్ ,రేణుక భాయ్ ల చిన్న కూతురు మధురిమబాయ్ ఆర్డీటీ తరపున ఏపీ జట్టులో స్థానం సంపాదించింది. ఈమె చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో ప్రతిభ కనపర్చడంతో గోల్డ్ మెడల్, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కైవసం చేసుకుంది.

సత్యసాయి ట్రస్టు సేవలు అభినందనీయం :రాష్ట్రపతి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్రపతిని కలిసిన సత్యసాయి ట్రస్టు సభ్యులు

సత్యసాయి ట్రస్టు అందిస్తున్న సేవలు విలువ కట్టలేని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అభినందించారు. గురువారం ఢిల్లీలో రాష్ట్రపతిని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ సభ్యులు నాగానంద, మనోహర్ శెట్టి కలిశారు. ఒడిస్సాలోని సత్యసాయి సేవా సమితిలో జరిగిన సాయి భజన సభలకు హాజరైన ట్రస్టు సభ్యులు ఢిల్లీలో రాష్ట్రపతిని కలిశారు. ట్రస్టు అందిస్తున్న కార్యక్రమాలను రాష్ట్రపతికి వివరించినట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి సత్యసాయి ట్రస్టు అందిస్తున్న సేవలను అభినందించినట్లు చెప్పారు. సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, విద్య సంస్థలు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ట్రస్టు అందిస్తున్న సేవలు గురించి తనకు తెలుసు అని రాష్ట్రపతి గుర్తు చేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. నవంబర్ 23న జరగనున్న సత్యసాయి జయంతి వేడుకలకు హాజరుకావాలని ట్రస్టు సభ్యులు రాష్ట్రపతిని కోరినట్లు సమాచారం. ట్రస్టు ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలు, విద్య బోధన జరుగుతోందని ప్రపంచవ్యాప్తంగా సత్య సాయి సేవ సమితిలో అందిస్తున్న సేవలు గురించి రాష్ట్రపతికి వివరించినట్లు ట్రస్టు వర్గాలు పేర్కొన్నాయి.

కరువు మండలంగా ప్రకటించండి

నల్లచెరువు : కరువు పరిస్థితుల నేపథ్యంలో నల్లచెరువు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం స్థానిక తహశీల్దార్ రవికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో పంటసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మండల వ్యాప్తంగా రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఎకరాకు 25వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, వెంకటస్వామి, ఎస్వీ రమణ, తిరుపాలు, ఉమాశంకర్, మల్లిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సిఐను కలిసిన నాయకులు

ధర్మవరం టౌన్ : పట్టణ టూటౌన్ నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన అశోకకుమార్‌ను ఏపీ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు జూటూరు మహేంద్రతోపాటు పలువురు నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలి పారు. ఈ కారక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కుణుతూరు వెంకటేశ్, పట్టణ అధ్యక్షులు తీర్థప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

రొద్దం : రొద్దం గ్రామానికి చెందిన గాజుల నారాయణప్ప అనారోగ్యంతో గురువారం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న ఎంపిపి చంద్రశేఖర్, జెట్టి మారుతిరెడ్డి, ఆర్ఎ. రవిశేఖర్ రెడ్డి, నగరూరు రాజగోపాల్ రెడ్డి, బూచర్ల డీలర్ ముత్యాలు, వెంకట రెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అక్రమ లేఅవుట్ రాళ్లు తొలగింపు

లేపాక్షి : లేపాక్షి గ్రామ పొలంలో మామిడిమాకులపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో గ్రామ పంచాయతీ అధికారుల అనుమతులు లేకుండా వేసిన నూతన లేఅవుట్ ప్లాట్ నెంబర్లతో కూడిన సరిహద్దు రాళ్లను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ శివన్న, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా లేఅవుట్ వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాసరచన పోటీలు

ధర్మవరం టౌన్ : అయోడిన్ లోపాలు, రుగ్మతల నివారణ వారోత్సవాల సందర్భంగా అయోడిన్ వాడకంపై పట్టణంలోని కేజీబీవి కళాశాలలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.వి కష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాజా ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఎల్ సాల్మన్, ఆర్‌బిఎస్‌కె పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్లు పుష్పలత, కళాశాల ప్రిన్సిపల్ మీనా, సిహెచ్ఒ కళావతి, పర్యవేక్షకులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ముదిగుబ్బ : మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు దాడులపై అవగాహన కల్పించడంలో భాగంగా మండల కేంద్రంలోని ఎస్‌డిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థిని విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకొని వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ, పోలీఉలు నరేష్, శ్రీనివాసులు, ఎస్‌డిఆర్‌ఆర్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రకాష్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి , ఎన్‌ఎస్‌ఎస్ పిఒ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల ఆశీస్సుల కోసం ముందడుగు కార్యక్రమాన్ని 4 వ రోజు గురువారం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో మండలంలోని బుల్లసముద్రం, చత్రం, కంటిపురం బి.రాయపురం,అయ్యవారిపల్లి దేవానపళ్యం, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ముందడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో మాజీ మంత్రి, సి డబ్ల్యు సి మెంబర్ రఘువీరా రెడ్డి ప్రతి గ్రామాన్ని సందర్శిస్తారని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, ప్రభాకర్, లక్ష్మి కాంత్, పుట్టరంగప్ప, గంగప్ప, వెంకటరామప్ప, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది బిసిల దగా యాత్ర : టిడిపి

ప్రజాశక్తి మడకశిర

వైసిపి ప్రభుత్వం చేపట్టింది సామాజిక సాధికారత బస్సు యాత్ర కాదని అది బీసీల దగా యాత్ర అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి విమర్శించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం వైసిపి నాయకులు ఏముఖం పెట్టుకుని సామాజిక సాధికారిక బస్సు యాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీలకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీల పట్ల కక్ష సాధిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మందిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో ఉంచారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, జిల్లా నాయిబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు రామాంజనేయులు, మడకశిర మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మనోహర్, రొళ్ల మండల కన్వీనర్ దాసిరెడ్డి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

ఫలించిన కార్మికుల పోరాటం

ప్రజాశక్తి-హిందూపురం

నీలకంఠపురం శ్రీ రామి రెడ్డి వాటర్ వర్క్స్ కార్మికులు గుత్తేదారులు చేస్తున్న అన్యాయంపై నెల రోజులకు పైగా ఆందోళన కార్యక్రమాలను సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సమగ్ర విచారణ కోసం విచారణ అధికారిగా పి కేశవ నాయుడును నియమించింది. విచారణ అధికారి కేశవ నాయుడు గురువారం పట్టణంలోని పంప్ హౌస్ వద్ద హిందూపురం, పెనుకొండ డివిజన్‌లలో కార్మికులతో విచారణ చేపట్టారు. ఈ విచారణలో గుత్తేదారులు బోగస్ కార్మికుల పేర్లను పెట్టి వారికి వేతనాలు ఇస్తున్నట్లు గ్రహించారు. దీంతో పాటు ప్రభుత్వం ఇస్తున్న వేతనం కన్నా గుత్తేదారులు కార్మికులకు తక్కువ ఇస్తున్నట్లు వారి విచారణలో తేలింది. విచారణ నివేదికను అధికారులకు అందజేస్తున్నట్లు విచారణ అధికారి కేశవనాయుడు తెలిపారు. ఇదే సందర్భంగా సిఐటియు నాయకులు విచారణ అధికారిని కలిసి కార్మికులకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, శ్రీ రామి రెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సోమశేఖర్, నాయకులు మంజూనాథ్, బాలు, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విచారిస్తున్న అధికారి కేశవ నాయుడు

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని నేసేపేటలో అక్రమంగా కర్నాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 116 కర్నాటక మద్యం ప్యాకెట్లు, 41 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ, కానిస్టేబుళ్లు లక్ష్మీనరసింహులు శివశంకర్లు కలిసి నేసేపేటలోని పుట్లమ్మగుడి వద్ద ఓ టీస్టాల్లో అక్రమంగా కర్నాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి రూ.28,207ల విలువ చేసే 118 కర్నాటక మద్యం ప్యాకెట్లు, 41 కర్నాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సిఐ

పేకాట జూదరులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని వైభవ్ లాడ్జి వెనుక బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు వారి వద్ద నుండి రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో పేకాటరాయుళ్ల అరెస్టు వివరాలను వెల్లడించారు. లాడ్జి వెనుక భాగంగా జూదం ఆడుతున్న వవారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 12వేలు నగదుతోపాటు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా మండలంలోని నడిమి గడ్డపల్లి చెందిన కాయల రామకృష్ణ ధర్మవరం చెరువు ఒకటవ మరువ వద్ద ఆక్రమంగా కర్నాటక మద్యం కలిగి ఉన్నట్టు సమాచారం రావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్దనుండి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మడకశిర రూరల్ : పట్టణంలో రాజీవ్ గాంధీ సర్కిల్ వద్ద గురువారం లక్ష్మమ్మ అనే మహిళా వద్ద నుండి 130 కర్నాటక టెట్రా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో పోలీసులు లక్ష్మమ్మ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి , కదిరి

O.S.NO:818/2023

Between:

బి.జగన్ మోహన్ రెడ్డి తండ్రి బి.ఆనంద్ రెడ్డి, వయస్సు 32 సం॥లు, హిందూ, వ్యవసాయం మరియు వ్యాపారం, R/o D.No:14-460-C, మూర్తిపల్లి, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ...వాది

మరియు

కాసాబత్తిన శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య, వయస్సు 41 సం॥లు, హిందూ, వ్యాపారం, R/o D.No:3-27-A-4-1, కోనేరు స్ట్రీట్, కదిరి (టౌన్ మరియు మండలం) శ్రీ సత్యసాయి జిల్లా ...ప్రతివాది

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

పైన తెలిపిన వాది అయిన బి.జగన్ మోహన్ రెడ్డి అను అతను, ప్రతివాది అయిన కాసాబత్తిన శ్రీనివాసులు అనే నీపై ప్రాంసరి నోటు బాకీ వసూలు నిమిత్తం పైన తెల్పిన దావాను పైన తెల్పిన కోర్టులో వేసి ఉన్నారు.పై దావాలో నీ యొక్క హాజరు నిమిత్తము కోర్టు వారు 17/11/2023వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున ప్రతివాది అయిన నీవు పై తెల్పిన వాయిదా తేది ఉదయం 10:30 గం॥లకు కోర్టు వారి ఎదుట నీవు కానీ, నీ యొక్క వకీలు ద్వారా గానీ ఖుద్దున హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు హాజరు కాని పక్షంలో దావాను నీ పరోక్షముగా తీర్మానించబడునని నీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:17/11/2023

స్థలం: కదిరి **ఇట్లు**

ఎ.క్రిష్ణమూర్తి, యమ్.ఎ., ఎల్,ఎల్,బి.
వాదిపరం న్యాయవాది, కదిరి
సెల్:9440310692

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి , కదిరి

O.S.NO:815/2023

Between:

లోయనపల్లి సుబ్బరాయుడు తండ్రి లేట్ రామచంద్ర, వయస్సు 31 సం॥లు, హిందూ, వ్యవసాయం మరియు వ్యాపారం, R/o D.No:3-57, కె.బత్తలపల్లి, కదిరి (పోస్టు) మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా, సెల్:9676639308 ...వాది

మరియు

కాసాబత్తిన శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య, వయస్సు 42 సం॥లు, హిందూ, వ్యాపారం, R/o D.No:3-27-A-4-1, కోనేరు స్ట్రీట్, కదిరి (టౌన్ మరియు మండలం) శ్రీ సత్యసాయి జిల్లా ...ప్రతివాది

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

పై దావాను వాది అయిన ఎల్.సుబ్బరాయుడు, సింపుల్ హై మార్ట్ ... దావాలో రూ. 18,44,266:00 మొత్తమును వసూలు చేయు నిమిత్తం ప్రతివాది అగు కాసాబత్తిని శ్రీనివాసులు అయిన నీపె దావా వేసి ఉన్నాడు. ఆ దావాలో నీ యొక్క హాజరు నిమిత్తము కోర్టు వారు 9/11/2023వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. పై తెల్పిన వాయిదా తేది ఉదయం 10:30 గం॥లకు కోర్టు వారి ఎదుట నీవు కానీ, నీ యొక్క వకీలు ద్వారా గానీ ఖుద్దున హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు హాజరు కాని పక్షంలో దావాను నీ పరోక్షముగా తీర్మానించబడునని నీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:09/11/2023

స్థలం: కదిరి **ఇట్లు**

ఎ.క్రిష్ణమూర్తి, యమ్.ఎ., ఎల్,ఎల్,బి.
వాదిపరం న్యాయవాది, కదిరి
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి

O.S.NO:425/2019

Between:

గంధం రాజా తండ్రి నరసింహులు R/at డోర్ నెం:1/1266, పవర్ ఆఫీసు దగ్గరలో ముదిగుబ్బ గ్రామం మరియు మండలం శ్రీ సత్యసాయి జిల్లా. ... PLAINTIFF

and

పిండి కుమరయ్య తండ్రి ముత్తయ్య, R/at ఎలక్ట్రిసిటీ సబ్-స్టేషన్ దగ్గరలో, ముదిగుబ్బ గ్రామం మరియు మండలం శ్రీ సత్యసాయి జిల్లా. ...DEFENDANT

పై దావాలోని ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది, తనకి రావలసిన ప్రామిసరీ బాకీ వసూలు నిమిత్తము ప్రతివాది అయిన మీ పైన పై కోర్టులో దావా వేసి ఉన్నారు. పై దావాను ఘనమైన కోర్టువారు 03/11/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 03/11/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

స్థలం:కదిరి
వాయిదా:03/11/2023

ఎల్.లోకేశ్వర రెడ్డి, యమ్.ఎ, బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి,

ఇష్టారాజ్యంగా సర్దుబాటు చేయొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటును వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ నాయకులు చెప్పారు. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, గౌరవ అధ్యక్షులు బూతన్న గురువారం ప్రకటన విడుదల చేశారు. సబ్జెక్టుకు సంబంధం లేని ఉపాధ్యాయులను సబ్జెక్టు టీచర్లుగా బదిలీ చేయడం సరైన చర్య కాదన్నారు. 460 మంది విద్యార్థులు ఉన్న పాఠశాల నుండి హిందీ రెండవ పోస్టును తీసేయడం అదేవిధంగా ఎన్‌పి. కుంట మండలంలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయురాలు బయోలాజికల్ సైన్స్ డిగ్రీలో చదివి ఉంటే ఆ ఉపాధ్యాయురాలను ఆంగ్లం బోధించాలని సుదూర ప్రాంతమైన అమడగూరు ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారని అన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంటిఎస్ ఉపాధ్యాయులను అదే మండలంలో నియమించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా సంబంధం లేని సబ్జెక్టుకు నియమించారని విమర్శించారు. ఎక్కువ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాల నుంచి ఎక్కువ పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు ఇష్టారాజ్యంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్నిజిల్లా విద్యాశాఖ అధికారికి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. అసంబద్ధ పక్రియను రద్దుచేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్దుబాటు చేయాలని లేని పక్షంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

వంతెనను పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్, కమిషనర్, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ పరిధిలోనిపోచనపల్లి వద్ద ఉన్నా పెన్నా నది వంతెన వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం కర్నాటక రాష్ట్రం నుంచి హిందూపురం వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్న ఒక వ్యక్తి శిథిలావస్థలో ఉన్న వంతెన పై నుంచి కిందకి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ నేపథ్యంలో 'అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి' అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి అధికారులు, పాలకులు స్పందించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంఈ వెంకటరమణ తదితరులు గురువారం వంతెనను పరిశీలించారు. ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతు త్వరలో రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో నూతన వంతెన నిర్మాణం చేపడుతామన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

యువతలో దేశభక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

నా మట్టి-నాదేశం ద్వారా యువతలో దేశభక్తిని పెంపొందిం చాలని ఎంఇఒ గోపాల్ పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన నెహ్రూ యువకేంద్రం, యువ మిత్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా స్థానిక సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ గోపాల్, నెహ్రూయువ కేంద్రం పోగ్రాం ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున, యువ మిత్ర యూత్ వెల్ఫేర్ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మోహన్‌రెడ్డిర, సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ సెక్రటరీ విష్ణువర్ధన్, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ రంగారెడ్డి, పార్థసారధి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సత్యకృప డిగ్రీకళాశాల విద్యార్థినులు

పేదోళ్ల గుడిసెల్లో 'పచ్చతోరణం'

గుడిసెల ముందు మొక్కలు నాటిన పేదలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద కోడూరు రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 805లోని జగనన్న లేఅవుట్ లో పేదలు వేసుకున్న గుడిసెల వద్ద 'పచ్చతోరణం' పేరిట మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 805 లో జగనన్న లేఅవుట్ వేసిన అధికారులు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా జగనన్న పచ్చతోరణం పేరిట మొక్కలు నాటాల్సిఉన్నప్పటికీ ఆ పనిని చేపట్టలేదని అన్నారు. దీంతో ఇళ్ల స్థలాల సాధన కమిటీ తీర్మాణం మేరకు ప్రతి గుడిసె వద్ద మొక్కలను నాటినట్లు చెప్పారు.అధికారులు చొరవ చూపి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేయాలన్నారు. అంతేకాకుండా తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షులు లక్ష్మినారాయణ, రామచంద్ర, చందు, సదాశివరెడ్డి, రహంతుల్లా, రియాజ్, శివ, మణి తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నాటుతున్న నాయకులు, పేదలు

ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం

ముదిగుబ్బ : ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానికమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువానం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఎంపిపి ఆదినారాయణ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ నాగేంద్రతో పాటు ఆయా శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

రొద్దం : మండలంలోని పి కొత్తపల్లి గ్రామంలో అనంత శక్తి సొసైటీ సిఇఒ లావణ్య, తహసీన్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గృహహింస, బాల్య వివాహాలు తదితర వాటిపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి సిఇఒ రమీజా, రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేయండి

ధర్మవరం టౌన్ : పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇళ్లను వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ బాలాజీ పేర్కొన్నారు. పట్టణంలోని 29వ వార్డులో గృహ నిర్మాణ పురోగతిపై గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఇ మాట్లాడుతూ వివిధ స్థాయిలో నిలబడిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ ఇన్చార్జ్ బాలిరెడ్డి, అమ్యూనిటీ సెక్రటరీ, వర్క్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వస్త్రాలు అందజేత

హిందూపురం : పట్టణంలోని 9వ వార్డులో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు వార్డు కౌన్సిలర్ మంజుళ తన నివాసం వద్ద నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు దసర పండుగ సందర్భంగా తన వంతుగా కార్మికులకు దుస్తులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దుర్గ నవీన్, వడ్డే ప్రసాద్, నాని, రాహుల్, సోహిత్, నేహా, దీక్ష, బాలాజీ, తన్విక, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

హిందూపురం : చిలమత్తూరుకు చెందిన వాల్మీకి నాయకుడు నరేష్‌తో పాటు మరో 100 మంది దీపిక సమక్షంలో గురువారం పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద వైసిపిలోకి చేరారు. వీరిని దీపిక పార్టీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరామన్నారు. పార్టీ బలోపేతం కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీలు హరీష్, రాఘవేంద్ర రెడ్డి, షాకీర్, భాస్కర్ రెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుదాం

హిందూపురం : అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపికి ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుదామని బిఎస్‌పి రాష్ట్ర నాయకులు శ్రీరాములు అన్నారు. గురువారం పట్టణ అధ్యక్షులు దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బహుజనులకు రాజ్యాధికారం బిఎస్పీ తోనే సాధ్యం అనే నినాదంతో పార్టీ కార్యలయం నుండి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హరికుమార్, హిందూపురం నియోజకవర్గం కన్వీనర్ చౌళూరు రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షులు నాజీమ్ భాష, న్యాయవాది సత్యనందమూర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం అందించే ఏకైక పార్టీ బిఎస్‌పి అన్నారు. రానున్న ఎన్నికల్లో బిఎస్‌పి బలమైన శక్తిగా తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కమిటీ నాయకులు సుబ్బరాయప్ప, ఎంఎల్ నారాయణ, సడ్లపల్లి నారాయణప్ప, చిరంజీవి, మోత్కుపల్లి కృష్ణప్ప, మారుతి, నాగరాజు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పంటల ముసాయిదా జాబితా ప్రదర్శన

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద 26నుండి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించబడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో 2023 సంవత్సరానికి గాను 4,25,084 ఎకరాలలో పంటల సాగు, పంట నమోదు కార్యక్రమం పూర్తి చేశామని చెప్పారు. ఈ అంశానికి సంబంధించి గ్రామ సభలు కూడా నిర్వహించబడతాయని ఆయన వివరించారు. ఈ గ్రామసభలలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో వున్న రైతుల పంటల నమోదు అన్ని వివరాలను చదివి వినిపిస్తారని అన్నారు.

మృతుల కుటుంబాలకు తక్షణ సాయం

గోరంట్ల రూరల్ : చిక్‌బళ్లాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు పెనుకొండ శాసనసభ్యులు మాల గుండ్ల శంకరనారాయణ తక్షణసాయం అందజేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం చిక్‌బళ్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మృతుల కుటుంబాలకు తక్షణ సాయం కింద పదివేల చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, గోరంట్ల సీఐ సుబ్బరాయుడు, సర్పంచి సరోజ నాగే నాయక్, వానవోలు ఉప సర్పంచి బుల్లెట్ బాబు,మండల సచివాలయ కన్వీనర్ సమరసింహారెడ్డి, మాజీ టౌన్ కన్వీనర్ మేదర శంకర, పెనుకొండ జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, చైర్మన్ ఉమర్ ఫారూఖ్ ఖాన్, కొండల రాయుడు, వైశాలి జయశంకర్ రెడ్డి, గంగూలీ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ : చిక్‌బళ్లాపూర్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై 13 మంది మృతిచెందడంపై పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిక్‌బళ్లాపూర్ జిల్లా ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు వ్యక్తిగతంగా ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం తరపున కూడా అర్థిక సహాయం వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

బాధితులతో మాట్లాడుతున్న పార్థసారధి

మృతదేహాలను పరిశీలిస్తున్న సవితమ్మ

ప్రజాశక్తి - పెనుకొండ

చిక్ బళ్లాపూర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది కూలీలు మృతిచెందడం బాధాకరమని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి అన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే హుటా హుటిన ప్రమాద స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు, వారు ఏయే ప్రాంతాలకు చెందిన వారని ఆరా తీశారు. చనిపోయిన వారంతా వలస కూలీలే కావడం బాధాకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందిస్తూ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కర్నాటక రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక్కొక్కరికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గోరంట్ల: కర్నాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ పెనుగొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోరంట్ల మండలానికి చెందిన అరుణ ఆమె కుమారుడు రుత్విక్, వానవోలుకు చెందిన వెంకటాద్రి ఆయన భార్య లక్ష్మీ మృతిచెందడం బాధాకరమన్నారు.

పెనుకొండ : చిక్‌బళ్లాపూర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమనిటీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న సవితమ్మ చిక్‌బళ్లాపూర్ ఆసుపత్రి వద్దకు చేరుకొని మతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ 20 లక్షల ఎగ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా చిక్ బళ్లాపూర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంపై పెనుకొండ ఎజిపి ఎం. భాస్కర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి ని వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో 13 మంది కూలీలు మృత్యువాత పడటం దురదష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రోడ్డు ప్రమాదంపై పెనుకొండ వైసిపి సీనియర్ నాయకురాలు సానే ఉమారాణి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో 13 మంది కూలీలు మృత్యువాత పడటం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు.

ధర్మవరం టౌన్ : గోరంట్ల మండలానికి చెందిన 13 మంది వలస కూలీలు కర్నాటక రాష్ట్రంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని జనసేన నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గోరంట్ల రూరల్: రోడ్డు ప్రమాద మృతులంతా గోరంట్ల పరిసర ప్రాంతాలకు చెందినవారు కావడం చాలా బాధాకరం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల క్రిష్టప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పుట్టపర్తి క్రైమ్ : కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఇప్పటికే రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు.మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.